**కబ్జా కోరల్లో చెరువు శిఖం**







**రసాభాసగా బల్దియా సమావేశం**



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatodaynews.com


## పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి



**అక్షటుడే, పెద్ద కొడప్‌గల్:** మండలంలోని పోచారంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ బాలాజీ పాటిల్ అధ్యక్షతన జరిగిన సభలో పర్యావరణ పరిరక్షణపై గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎంపీవో లక్ష్మీకాంత్ మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తుండడంతో గ్రామస్థులు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామస్థులకు సరఫరా అవుతున్న మంచి నీరు కలుషితం కాకుండా పంచాయతీ సిబ్బంది జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలాజీ పాటిల్, ఉప సర్పంచ్ మేత్రి రాజు, కార్యదర్శి ఆశిష్ పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణకు చెరువులు దోహదపడతాయి: కలెక్టర్



**అక్షరటుడే, కామారెడ్డి:** వర్షం నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పర్యావరణ పరిరక్షణకు చెరువులు ఎంతో దోహదపడతాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణంలో డీఎంఎఫ్ (టి) నిధులు రూ.6.55 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన చెరువును ప్రారంభించారు. కలెక్టర్ చెరువు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. చెరువు చుట్టూ పరిశుభ్రత పాటించాలని, పచ్చదనంతో అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో వర్షపు నీటిని సద్వినియోగం చేసేందుకు ఇటువంటి చర్యలు ఆదర్శప్రాయంగా నిలుస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడంతో పాటు, భవిష్యత్తులో ఈ ప్రాంతంలో బతుకమ్మ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేలా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ ఎన్‌వీ గిరి, డీఆర్డీవో దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా, వారిని పునరుత్పాదక ఇంధన రంగంలో భాగస్వాములను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో విజయవంతంగా ప్రారంభమైన 'సౌర విద్యుత్' ప్రయోగం, ఇప్పుడు నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల్లోనూ విస్తరించనుంది. ఈ నిర్ణయం మహిళా సంఘాల జీవన ప్రమాణాలను మార్చడమే కాకుండా, గ్రామాల్లో పారిశ్రామికీకరణకు కొత్త ఒరవడిని సృష్టించనుంది.**

**- అక్షరటుడే, భీమ్‌గల్**



■ మహిళా సంఘాల చేతికి విద్యుత్ పగ్గాలు! ■ ఆర్థిక స్వావలంబన దిశగా మరో ముందడుగు

■ జిల్లా వ్యాప్తంగా సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళికలు

# సౌర వెలుగులు

ఈ సౌర విద్యుత్ కేంద్రాల ద్వారా మహిళా సంఘాలు కేవలం అదనపు ఆదాయాన్ని పొందడమే కాకుండా, తమ స్వశక్తితో వ్యాపార నిర్వహణను చేపట్టే స్థాయికి ఎదుగుతాయి. ప్లాంట్ల నిర్వహణ, విద్యుత్ విక్రయం ద్వారా వచ్చే లాభాలు నేరుగా మహిళా సంఘాల ఖాతాల్లోనే జమ అవుతాయి. దీంతో సంఘం సభ్యులు తమ వ్యక్తిగత పొదుపును పెంచుకోవడమే కాకుండా, సభ్యులకు స్వల్పకాలిక రుణాలను ఇచ్చేందుకు కూడా ఈ నిధులు ఉపయోగపడతాయి.

### నైపుణ్యాభివృద్ధి

ప్లాంట్ల నిర్వహణ, రిజిస్టర్ల మెయింటెనెన్స్, ప్యానెళ్ల శుభ్రత, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాల్లో మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వల్ల వారికి సరికొత్త నైపుణ్యాలు అందుతాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని అనేక మండలాల్లో సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, ఒక మెగావాట్ సామర్థ్యం గల ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో మహిళా సంఘాల వివరాలు**

| జిల్లా | సంఘాలు | సభ్యులు |
|---|---|---|
| నిజామాబాద్ | 24,030, | 2,38,511 |
| కామారెడ్డి | 18,018, | 1,76,940 |

### నిర్ణయాధికారం మహిళలదే..

ఈ ప్రాజెక్టుల ప్రత్యేకత ఏంటంటే, ఇందులో పెట్టుబడి నుండి నిర్వహణ వరకు ప్రతి దశలోనూ మహిళ లకే ప్రాధాన్యత ఉంటుంది. బ్యాంకు రుణాల మంజూరు లోనూ, ప్రభుత్వ సబ్సిడీల వినియోగంలోనూ మహిళా సంఘాలకు పూర్తి సహకారం అందుతోంది. ప్రభుత్వ నిర్ణయంతో మహిళా సంఘాలకు ఆదాయం సమకూరనుంది. మరోవైపు సౌర విద్యుత్ ఉత్పత్తి సైతం పెరగనుంది.




## హోంగార్డు భార్యతో ఎస్సై వివాహేతర సంబంధం..?

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** జిల్లాలో పనిచేస్తున్న ఓ ఎస్సైపై హోంగార్డు సంచలన ఆరోపణలు చేశాడు. తన భారతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని ఆరోపించాడు. తనను తీవ్రంగా వేధింపులకు గురి చేస్తున్నాడని.. తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు. ఈ ఘటన జిల్లాలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. బోధన్ డివిజన్‌లోని ఓ మండల ఎస్సై తనను వేధిస్తున్నట్లు హోంగార్డు వీడియో విడుదల చేశాడు. మొదట్లో తాను ఎస్సై ఇంట్లో పని చేశానని చెప్పాడు. అయితే హోంగార్డు అయిన తనతో కాళ్లు ఒత్తించుకునేవాడని, ఇంటిపని, గిన్నెలు తోమడం వంటివి కూడా చేయించారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆ పని నచ్చకపోవడంతో మానేసినట్లు చెప్పాడు. అనంతరం తనపై ఎస్సై కక్ష పెంచుకొని స్టేషన్‌లో నిత్యం వేధిస్తున్నాడని ఆరోపించాడు. తన భార్యకు తనకు గొడవ జరిగితే పోలీస్ స్టేషన్‌కు వచ్చిందన్నారు. అయితే తనపై కక్ష గట్టిన ఎస్సై తన భార్యతో అక్రమ కేసులు పెట్టిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎస్సై తన భార్యతో ఆరు నెలలుగా వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని ఆరోపించాడు. తనను మానసికంగా వేధిస్తున్నాడని వాపోయాడు. తనకు కావాలని బందోబస్తు డ్యూటీలు వేస్తున్నారని చెప్పాడు. మేడారం, ఏడుపాయల జాతరకు పంపించారని చెప్పాడు. ఎస్సై భార్య లేని సమయంలో తన భార్యను ఇంటికి తీసుకు వెళ్తున్నాడని ఆరోపించాడు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానని వీడియో విడుదల చేశాడు.



## మంజీరలో అధికారుల సర్వే.. పత్తాలేని మహారాష్ట్ర అధికారులు

**అక్షరటుడే, బోధన్:** తెలంగాణ మహారాష్ట్ర మధ్య కొన్నేళ్లుగా సరిహద్దు భూ వివాదం నెలకొంది. మహారాష్ట్ర ప్రభుత్వం మంజీర నది నుంచి తమ భూ భాగంలో ఇసుక తోడుకునేందుకు అనుమతులు ఇచ్చింది. అయితే మహారాష్ట్ర ఇసుక క్వారీ నిర్వాహకులు తెలంగాణ భూభాగం నుంచి సైతం ఇసుకను తీసుకెళ్లడంతో సరిహద్దు వివాదం తలెత్తింది. సరిహద్దులో ఇసుక వివాదాన్ని పరిష్కరించుకునేందుకు ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి సర్వే నిర్వహించాలని నిర్ణయించాయి. దీంతో శుక్రవారం తెలంగాణ రాష్ట్రం నుంచి బోధన్ డివిజన్ అధికారులు హాజరయ్యారు. కానీ మహారాష్ట్ర ప్రభుత్వ అధికారులు మాత్రం సర్వేకు రాకుండా ముఖం చాటేశారు. సాలూర మండలం హున్సా, మంజీర సరిహద్దుల వద్ద తెలంగాణ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించేందుకు పరికరాలతో సిద్ధమయ్యారు. ఈ సర్వేలో పాల్గొనాల్సిన మహారాష్ట్ర రెవెన్యూ, సర్వే అధికారుల కోసం తెలంగాణ యంత్రాంగం ఉదయం నుంచి ఎదురుచూసింది. అయితే అటువైపు నుంచి అధికారుల జాడ కనిపించలేదు. ఎలాంటి సమాచారం కూడా లేదు. ఒక పక్క అధికారుల సర్వేకు రంగం సిద్ధమవుతున్నప్పటికీ మహారాష్ట్ర ఇసుక మాఫియా మాత్రం ఏమాత్రం భయం లేకుండా తమ కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉందని సమాచారం. సర్వే జరుగుతోందన్న విషయాన్ని సైతం ఏమాత్రం లెక్కచేయకుండా వారి భూభాగంలో యథేచ్ఛగా ఇసుకను తవ్వుతున్నారు. ఇరు రాష్ట్రాల సరిహద్దుల వద్ద అధికారులు ఉన్నారన్న భయమే లేకుండా రవాణాను ఆపకుండా బహిరంగంగానే ఇసుకను దోచేస్తుండడం గమనార్హం.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



**అక్షరటుడే, ఇందూరు:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్క నాటి నీళ్లు పోశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. కాలుష్యాన్ని పెంచే పనులు చేయవద్దని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి అందించాలనుకుంటే తప్పనిసరిగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో జీజీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ నాగమోహన్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

## వానాకాలం సీజన్‌లో అధికారులు సమన్వయంతో పనిచేయాలి




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** వానాకాలం అత్యవసర పరిస్థితుల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మాన్‌సూన్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని అధికారులతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. భారీవర్షాలు, ఆకస్మిక వరదలు, చెరువులు, వాగులు పొంగిపొర్లినప్పుడు పోలీస్ శాఖ అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రహదారులు దెబ్బతింటాయని.. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడం వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో పోలీస్‌శాఖ చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో వరదలకు గురయ్యే లోతట్టు ప్రాంతాలు.. ప్రమాదకర వంతెనలు, వాగులు, చెరువులు, కాలువలు, జలాశయాలు, కూలిపోయే అవకాశం ఉన్న పురాతన ఇళ్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. భారీ వర్షాలు కురిసే సమయంలో ట్రాఫిక్ అంతరాయం కలిగే ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు.. అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని సీపీ సూచించారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించాలని, వరద నీటిలో ప్రజలు, వాహనాలు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.సమావేశంలో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్ ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, మల్లేష్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ వీరయ్య, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఐటీ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అరుదైన శస్త్రచికిత్సకు వేదికగా నిలిచిన నిజామాబాద్ జీజీహెచ్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జీజీహెచ్ నిజామాబాద్‌లో వైద్యులు మరో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రిలోని గుండె వైద్య సేవల విభాగం పీటీసీఏ (పెర్క్యుటేనియస్ ట్రాన్స్‌లూమినల్ కరోనరీ యాంజియోప్లాస్టీ) సర్జరీ చేసి ఓ ప్రాణాన్ని కాపాడింది. నగరంలోని జిల్లా జనరల్ ఆస్పత్రికి 65 ఏళ్ల వయస్సున్న బురాజీ అనేవ్యక్తి మంగళవారం రాత్రి తీవ్రమైన ఛాతినొప్పితో వచ్చాడు. వైద్యులు పరీక్షించి ఆయనకు అక్యూట్ మయోకార్డియల్ ఇన్‌ఫార్షన్ తో గుండెపోటు వచ్చినట్లు నిర్ధారించారు. రోగి పరిస్థితిని గుర్తించిన కార్డియాలజీ వైద్యులు వెంటనే థ్రాంబోలైసిస్ చేసి రోగిని స్థిరీకరించారు. అనంతరం గురువారం నిర్వహించిన యాంజియోగ్రామ్ పరీక్షలో గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రైట్ కరోనరీ ఆర్టరీ లో తీవ్ర బ్లాకేజీ ఉన్నట్లు గుర్తించారు. దీంతో కార్డియాలజీ బృందం విజయవంతంగా పెర్క్యుటేనియస్ ట్రాన్స్‌లూమినల్ కరోనరీ యాంజియోప్లాస్టీ పీటీసీఏ, స్టెంట్ అమరిక చేపట్టారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండి, కోలుకుంటున్నారు. జీజీహెచ్ నిజామాబాద్‌లో మొట్టమొదటి పీటీసీఏ (స్టెంట్) ప్రక్రియను కార్డియాలజీ విభాగ వైద్యులు సందీప్, గోపీకృష్ణ, రవికిరణ్‌లు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ బీవీ నాగమోహన్, డిప్యూటీ సూపరింటెండెంట్ రాములు, కార్డియాలజీ బృందాన్ని, క్యాథ్ ల్యాబ్ సిబ్బందిని, నర్సింగ్, సహాయక సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా ప్రజలకు అత్యాధునిక



గుండె వైద్య సేవలను స్థానికంగానే అందించడంలో ఇది ఒక కీలక మైలురాయి అని పేర్కొన్నారు. ఇకపై గుండెపోటు రోగులకు అత్యవసర చికిత్సలు, స్టెంట్ ప్రక్రియలు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలోనే అందుబాటులోకి రావడం సంతోషకరమని తెలిపారు. జిల్లా ప్రజలకు నాణ్యమైన, సకాలంలో అత్యవసర గుండె వైద్య సేవలు అందించేందుకు జీజీహెచ్ నిజామాబాద్ నిరంతరం కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు.

## చంద్రశేఖర్ రెడ్డిని సస్పెండ్ చేయకపోతే గాంధీభవన్‌లో దీక్ష

**అక్షరటుడే, కామారెడ్డి :** టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయకపోతే కామారెడ్డి నుంచి వెయ్యి మందితో గాంధీ భవన్‌లో దీక్ష చేపడతామని కామారెడ్డి కాంగ్రెస్ నాయకులు సంచలన ప్రకటన చేశారు. అవసరం అయితే మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని పేర్కొన్నారు. కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని మండలాల అధ్యక్షులు, జిల్లా నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ వర్గ నేతలు మాట్లాడుతూ చంద్రశేఖర్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్‌లో ఉన్నత పదవుల్లో కొనసాగిన వారు డబ్బులకు అమ్ముడు పోయారన్నారు. గడ్డం చంద్రశేఖర్ రెడ్డి కాంగ్రెస్‌లో కొనసాగుతూ బీఆర్ఎస్ కోవర్టుగా పని చేస్తున్నారని ఆరోపించారు. కామారెడ్డిలో కాంగ్రెస్ ఖతం కావడం కోసం ఆయన పని చేస్తున్నారన్నారు. పార్టీని భ్రష్టు పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ లో ఉన్నప్పుడు ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్‌ను కొట్టినందుకు చంద్రశేఖర్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారని వారు గుర్తుచేశారు. నిజాయితీ కలిగిన షబ్బీర్ అలీపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, ఆ ఆరోపణలను నిగ్గు తేల్చాలని



డిమాండ్ చేశారు. చంద్రశేఖర్ రెడ్డిపై తాము చేసిన ఆరోపణలకు సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ తగ్గడానికి చంద్రశేఖర్ రెడ్డి వర్గమే కారణమని ఆరోపించారు. ఆయనపై ఉన్న వ్యతిరేకతే మెజారిటీ తగ్గడానికి కారణమన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సందీప్, నాయకులు గూడెం శ్రీనివాస్ రెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు పండ్ల రాజు, రాజాగౌడ్, నౌశిలాల్, గోనె శ్రీనివాస్, పాత రాజు, భీంరెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో నిత్యావసర సరుకుల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కామారెడ్డి జిల్లా పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో నిత్యావసర సరుకుల సరఫరా కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం అదనపు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని బాన్సువాడలో, తాడ్వాయి, పెద్దకొడప్‌గల్, తాడ్వాయ్, ఎల్లారెడ్డి, తాడ్వేల్, దోమకొండ, లింగంపేట్, కామారెడ్డి మున్సిపల్ డిగ్రీ కళాశాల, ఉప్పలవాయి, బిచ్కుంద, ఎల్లారెడ్డిపేట, దిష్టిపల్లి ఆచంపేట గురుకులాల్లో సరుకులు సరఫరా చేయాల్సి ఉంటుంది. కూరగాయలు, పండ్లు, మటన్, చికెన్, పాలు, క్యాటరింగ్ సర్వీస్, స్వీపింగ్, పారిశుధ్య సేవలు, స్టేషనరీ సామగ్రి, ల్యాబ్ మెటీరియల్ ఉంటాయి. టెండర్ ఫారం రూ.1,000 ఉంటుంది. ఎస్‌బీఐ సిరిసిల్ల రోడ్డు బ్రాంచ్, కామారెడ్డి, ప్రిన్సిపాల్ టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్/జేసీ (బాలుర) ఉప్పలవాయి పేరుతో డీడీ తీయాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫారాలు ఈనెల 13వ తేదీలోపు ఉప్పలవాయి టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్/జేసీ(బాలుర)లో తీసుకుని 13వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు సీల్ చేసి టెండర్ సమర్పించాల్సి ఉంటుంది. టెండర్లను ఈనెల 18న మధ్యాహ్నం 3 గంటలకు అదనపు కలెక్టర్ కార్యాలయంలో తెరుస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు, మహిళలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 40శాతం రిజర్వేషన్ వర్తిస్తుంది. పూర్తి వివరాలకు టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ సీవో ఆఫీస్ కామారెడ్డి లేదా టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్/జేసీ (బాలుర) ఉప్పలవాయిలో సంప్రదించాల్సి ఉంటుంది.




## కల్లడి గ్రామ పంచాయతీ నూతన కార్యదర్శిగా ప్రవీణ్

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలంలోని కల్లడి గ్రామ పంచాయతీ నూతన కార్యదర్శిగా ప్రవీణ్‌ను శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంగోల్ల సుస్మిత ప్రళయ్ తేజ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యదర్శి కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. నూతన కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, సిబ్బంది సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు దూదిగాం గంగాధర్, రొడ్డ వంశీకృష్ణ, మచ్చ సురేష్ గౌడ్, కారోబార్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



భూముల ధరలకు రెక్కలు రావడంతో పల్లెలు, పట్టణ శివార్లలోని చెరువులు, కుంటల శిఖం భూములు క్రమంగా కనుమరుగవుతున్నాయి. వందల ఏళ్ల చరిత్ర కలిగిన జల వనరులు ఇప్పుడు కాంక్రీట్ వనాలుగా మారుతున్నాయి. ఇదే కోవలో ఇందల్వాయి చెరువు నిలిచింది. 450 ఎకరాల విస్తీర్ణ మున్న ఈ చెరువు ప్రస్తుతం సగానికి పైగా కబ్జాలకు గురైంది. – అక్షరటుడే, డిచ్‌పల్లి

# కబ్జా కోరల్లో.. చెరువు శిఖం

- ఇందల్వాయి చెరువును ఆక్రమించిన కబ్జాదారులు
- వరుస ఫిర్యాదులు.. చర్యలు శూన్యం
- పట్టించుకోని అధికారులు

ఇందల్వాయి చెరువు కబ్జాకు గురైంది. చుట్టుపక్కల భూములున్న రైతులు శిఖంను దాదాపు 220 ఎకరాలు కబ్జా చేశారని సర్వే చేసి చెరువు భూమిని కాపాడాలని సర్పంచ్, వీడీసీ ఆధ్వర్యంలో ఇటీవల కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాలతో చెరువు చుట్టూ ఉన్న రైతులకు నోటీసులు ఇచ్చారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఎక్కతాటిపై నిలబడి కబ్జాకు గురైన ఇందల్వాయి చెరువు శిఖం భూమిని వెలికి తీయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

### భూగర్భంలోకి జలవనరులు..

జిల్లాలో డిచ్‌పల్లి, ఇందల్వాయి, జక్రాన్ పల్లి, ఆర్మూర్, భీమ్‌గల్, మోపాల్, ఎడపల్లితో పాటు అనేక మండలాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీర్చే చెరువులు క్రమంగా అంతరించిపోతున్నాయి. వేసవిలో నీటిమట్టం తగ్గడమే అదనుగా అక్రమార్కులు రంగంలోకి దిగుతున్నారు. రాత్రికి రాత్రే వందల ట్రాక్టర్ల మొరం, మట్టిని తీసుకొచ్చి చెరువు గర్భాన్ని పూడ్చివేస్తున్నారు. అక్రమార్కులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. మొదట చెరువు అంచులను, నీరు తగ్గిన ప్రాంతాలను మొరంతో సమాంతరం (లెవెలింగ్) చేస్తున్నారు. సదరు శిఖం భూమి పక్కనే ఉన్న ప్రైవేటు పట్టా భూముల నంబర్లను అడ్డుపెట్టుకుని, రెవెన్యూ రికార్డులను తారుమారు చేసేస్తున్నారు.

### శాఖల మధ్య సమన్వయ లోపం..

చెరువులు, కుంటల సంరక్షణ బాధ్యత నీటిపారుదల శాఖ (ఇరిగేషన్), రెవెన్యూ శాఖల సంయుక్త పరిధిలోకి వస్తుంది. అయితే ఈ రెండు శాఖల మధ్య సమన్వయ లోపం అక్రమార్కులకు వరంగా మారింది. డిచ్‌పల్లి మండలంలోని పలు గ్రామాల చెరువులను ఆక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఇరిగేషన్ అధికారులు వాస్తవ పరిస్థితిపై నివేదిక రూపొందించినప్పటికీ చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేయడం అనుమానాలకు తావిస్తోంది.

### లోపించిన పర్యవేక్షణ..

సాధారణంగా చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిని, బఫర్ జోన్లను గుర్తించి జియోట్యాగింగ్ చేయాలి. కానీ జిల్లా పరిధిలో అక్రమ నిర్మాణాలకు స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిళ్లు, కొంతమంది రెవెన్యూ అధికారుల మామూళ్ల పర్వాలే కారణమనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రజావాణిలో అనేక ఫిర్యాదులు వచ్చినా, కేవలం నోటీసులతో సరి పెడుతున్నారే తప్ప శాశ్వత చర్యలు కరువయ్యాయి.

### మత్స్యకారుల ఉపాధిపై దెబ్బ

చెరువుల కబ్జా కేవలం భూముల అక్రమ విక్రయాలకే పరిమితం అయిందనుకుంటే పొరబడినట్లే. అది స్థానిక మత్స్యకారుల జీవన విధానాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఒకవైపు కబ్జాలు, మరోవైపు చుట్టుపక్కల ఉన్న రైస్‌మిల్లుల వ్యర్థాలు, మురుగునీరు చెరువుల్లోకి చేరడంతో స్వచ్ఛమైన జలాశయాలు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. మత్స్యకారుల ఆవేదన చెందుతున్నారు. నీరు కలుషితం కావడం, చెరువుల పరిమాణం తగ్గిపోవడంతో వేలాది మత్స్యకార కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నాయి. చెరువు అలుగులను, ఇన్‌ఫ్లో కాలువలను పూడ్చివేయడం వల్ల వర్షాకాలంలో సమీప గ్రామాలు, కాలనీలు జలమయమయ్యే ప్రమాదం పొంచి ఉంది.

### మేల్కొనకపోతే వినాశనమే..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా లాంటి ప్రత్యేక వ్యవస్థల తరహాలోనే నిజామాబాద్ జిల్లా పరిధిలోనూ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా రీసర్వే నిర్వహించి, కబ్జాకు గురైన శిఖం భూములను స్వాధీనం చేసుకుని, అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తేనే భవిష్యత్తు తరాలకు ఈ జలవనరులు అందుతాయి.

## పోచంపాడ్‌లో బడిబాట కార్యక్రమం



**అక్షరటుడే, మెండోరా:** పోచంపాడ్‌లో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు, విద్య ప్రాముఖ్యతపై గ్రామస్థులకు అవగాహన కల్పించామని హెచ్‌ఎం ధర్మపురి తెలిపారు. ప్రతిచిన్నారి తప్పనిసరిగా చదువుకోవాలని దానికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధురి, ఉపసర్పంచ్ సంపంగి సతీష్, ఉపాధ్యాయులు భూపతి రావు, సురేఖ, సురేందర్ పాల్గొన్నారు.




## పోగొట్టుకున్న సెల్ ఫోన్లు అప్పగింత..

**అక్షరటుడే, ఆర్మూర్:** పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఈ మేరకు బాధితులైన ఆరే శ్రీనివాస్, నర్సింగ్ రావు, నవీన్, గణేష్‌లకు సెల్ ఫోన్లను అప్పజెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బాధితులు తాము సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేయగా కేసులు నమోదు చేసుకుని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని రికవరీ చేశామన్నారు. ప్రజలు తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే ఆధారాలతో తమను సంప్రదించాలని సూచించారు.

## రసాభాసగా కామారెడ్డి బల్దియా సమావేశం.. మధ్యలోనే వెళ్లిపోయిన చైర్మన్..

**అక్షరటుడే, కామారెడ్డి:** 'ఎజెండా తయారు చేసే ముందు కనీస సమాచారం ఇవ్వరా..? ఇష్టం వచ్చిన అంశాలను ఎజెండాలో చేరుస్తారా..?' అంటూ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి మున్సిపాలిటీ సాధారణ సమావేశం చైర్ పర్సన్ ఉమారాణి అధ్యక్షతన కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. సమావేశం మొదలైన గంటలోనే వాయిదా పడటం చర్చనీయాంశంగా మారింది. సమావేశం సందర్భంగా పలువురు కౌన్సిలర్లు వార్డుల్లో నెలకొన్న సమస్యలను ప్రస్తావించారు. గత కౌన్సిల్ సమావేశంలో తీర్మానించిన అంశాల పనితీరు ఎంతవరకు వచ్చిందో చెప్పాలని బీజేపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. గత కౌన్సిల్‌లో చేపట్టాల్సిన ఒక్క పని కూడా చేయకుండా కొత్తగా చేసిన ఎజెండా అంశాలను కౌన్సిలర్లకు చెప్పకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఇష్టం వచ్చిన పనులకు బిల్లులను ఆమోదించాలని ఎజెండాలో ఎలా పొందుపరుస్తారని నిలదీశారు. గురువారం కురిసిన వర్షానికి వార్డుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేక రోడ్లపై నీళ్లు పారుతున్నాయని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్లతో చర్చించిన తర్వాతే ఎజెండా తయారు చేయాలని అప్పటివరకు సమావేశం అవసరం లేదని అన్ని పార్టీల నాయకులు మూకుమ్మడిగా చెప్పారు. దాంతో చైర్ పర్సన్ కౌన్సిల్ హాలు నుంచి బయటకు వెళ్లిపోవడం చర్చకు దారి తీసింది. కౌన్సిల్ సభ్యులు సమావేశం వద్దంటే చైర్‌పర్సన్ వెళ్లిపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశం మధ్యలోనే ఆగిపోవడంతో వాయిదా వేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. దాంతో ఎజెండా అంశాలు ఒక్కటి కూడా ఆమోదానికి నోచుకోలేదు.



## కమ్మర్‌పల్లి ఎస్సైగా సీహెచ్ సతీష్




**అక్షరటుడే కమ్మర్ పల్లి:** కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా సీహెచ్ సతీష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

## కాశీ విశ్వనాథ ఆలయ కమిటీ ఎన్నిక



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** డిచ్‌పల్లి బస్టాండ్ పక్కన ఉన్న కాశీ విశ్వనాథ ఆలయ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొత్త గంగాసాగర్, ప్రధాన కార్యదర్శిగా చింతపంటి రాజారాం, కోశాధికారిగా బండి జ్ఞానేశ్వర్, గౌరవ అధ్యక్షుడిగా గద్దె భూమన్న, సలహాదారులుగా కట్ట అశోక్, నాగిరెడ్డి చెంచురెడ్డిలను ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షులుగా సంగు గంగాదాస్, తాండ్ర అంజయ్య, కోటగిరి శేఖర్, మామిడాల రాజు, రేఖ రాము, సహాయ కార్యదర్శులుగా తడకమడ్ల శ్రీనివాస్, భరత్, నిమ్మల గంగిరెడ్డి, ఇజిగిరి సురేష్, మేదరి రాజు, సలహాదారులుగా బచ్చు రాందాస్, రాజురు సుభాష్, బండి సత్యనారాయణ, పండిత్ మురళి, సభ్యులుగా అబ్బులు, ఎల్ఐసీ రాములు, బావేష్, నారాయణ, శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ నూతన కమిటీ ప్రతినిధులను సన్మానించారు.

## చెట్టును ఢీకొన్న వ్యాన్.. పలువురికి గాయాలు

**అక్షరటుడే, గాంధారి:** ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఓమ్ని వ్యాన్ చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటన పోతంగల్ కలాన్ గేట్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది.

### బాన్సువాడ వైపు వెళ్తుండగా..

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి నుంచి బాన్సువాడ వైపు వెళ్తున్న బైక్‌ను తప్పించిబోయి గాంధారి వైపు వస్తున్న హోమ్ని వ్యాన్ వేగంగా చెట్టును ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న వ్యక్తికి, వ్యాన్‌లో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. ఓమ్ని చెట్టుకు ఢీకొట్టడంతో ముందు భాగం ధ్వంసమైంది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలపాలైన క్షతగాత్రులను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.












## ఘనంగా పర్యావరణ దినోత్సవం

ఉమ్మడి జిల్లాలో పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు.. అధికారుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షలకు ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. – అక్షరటుడే, వెబ్‌డెస్క్







